


## దేశంలో పెరుగుతున్న పెళ్లికాని యువత

- తెలంగాణలో 47.5 శాతం
- ఏపీలో 43.7 శాతం యుక్తవయసు పెళ్ళికి దూరం
- పెళ్ళి కంటే సంపాదన.. జీవిత లక్ష్యాలపైనే మోజు

**మహా నెట్ వర్క్ :** దేశంలో పెళ్లి కాని యువత సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉన్నత విద్య, ఉద్యోగాలు, వ్యక్తిగత నిర్ణయాలు వంటి కారణాల వల్ల వివాహాలు ఆలస్యమవుతున్నాయి. యుక్త వయసు జనాభాలో 51.1 శాతం మంది పెళ్లి చేసుకోలేదని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో పురుషులు 56.3 శాతం, మహిళలు 45.7 శాతంగా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలో 47.5 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 43.7 శాతం పెళ్లికాని వారు ఉన్నారని జనాభా లెక్కల విభాగం వెల్లడించింది. యుక్త వయసు వచ్చిన వారు పెళ్ళిపై కాకుండా సంపాదన, తన జీవిత లక్ష్యం తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడమే ప్రధాన కారణమని కూడా తేలింది.

## మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్య డ్రగ్స్ దందా

- చెప్పల్లో డ్రగ్స్ పెట్టి సరఫరా.. ఏడు పబ్ లకు నోటీసులు
- నిందితుల్లో ఇద్దరు పోలీస్ ఉన్నతాధికారుల కుమారులు
- పక్కా సమాచారంతో 8 మందిని అరెస్టు చేసిన నార్కొటిక్స్ బ్యూరో
- నిందితుల్లో సైబరాబాద్ డీసీపీ, ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ కుమారులు

**హైదరాబాద్ సిటీ బ్యూరో, మహా**



హైదరాబాద్‌లోని కొంపల్లిలో డ్రగ్స్ దందా సంచలం రేపుతుండగా, మల్నాడు డ్రగ్స్ ఫైల్స్ లో కొత్త కోణాలు బయటికొస్తున్నాయి. మహిళల చెప్పులలో డ్రగ్స్ పెట్టి సరఫరా చేస్తున్న మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్య డ్రగ్స్ దందా కేసు దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ కేసులో 8 మందిని అరెస్ట్ చేయగా కేసులో ఏ2 గా ఉన్న పల్లెపాక మోహన్ ఓ పోలీసు ఉన్నతాధికారి కుమారుడు కాగా పరారీలో ఉన్న మరో నిందితుడు రాహుల్ తేజ్ కూడా పోలీసు అధికారి కుమారుడు కావడం సంచలనంగా మారింది.

**స్కార్పియో డాష్ బోర్డులో డ్రగ్స్**

హైదరాబాద్ కొంపల్లిలోని మల్నాడు రెస్టరెంట్ నిర్వాహకుడు సూర్య వద్ద మాదకద్రవ్యాలున్నాయనే సమాచారంతో ఇటీవల సైబరాబాద్ ఈగల్ టీమ్ పోలీసులు బృందం రెస్టారెంట్ వద్ద నిఘా ఉంచింది. ఈనెల 7న రాత్రి రెస్టారెంట్‌కు స్కార్పియోలో వచ్చిన సూర్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతని స్కార్పియో డాష్ బోర్డులో డ్రగ్స్ ఉన్నట్లు అంగీకరించాడు. తనిఖీ చేయగా 3.2 గ్రాముల ఐజీ వీడ్, 1.6 గ్రాముల 3 ఎక్సీసీ మాత్రలు లభించాయి. అనంతరం కారు ఫ్రంట్ సీట్ కింద దాచిన పార్సిల్ వెతకగా మహిళల చెప్పులు లభ్యమయ్యాయి. చెప్పు హీల్ లోపల 10గ్రాముల కొకైన్ దొరికింది. వాటితో పాటు నిందితుడి ఐఫోన్, స్కార్పియో కారును పోలీసులు జప్తు చేశారు. పబ్‌లో మాదకద్రవ్యాలు సేవించినట్లు అంగీకరించిన సూర్య పోలీసుల విచారణలో పలు అంశాలను వెల్లడించాడు. దర్యాప్తు చేసి సూర్యతో సహా మరో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

**డీసీపీ, అదనపు ఎస్పీల కుమారులు :**

ఈగల్ టీం దర్యాప్తులో నిందితుల్లో ఇద్దరు పోలీసు అధికారుల కుమారులు ఉండటంతో ఈ ఘటన విస్మయానికి గురిచేస్తోంది. ఈ కేసులో A2గా ఉన్న పల్లెపాక మోహన్ తండ్రి సంజీవరావు సైబరాబాద్ కీలక వింగ్‌కు డీసీపీగా ఉన్నారు. పరారీలో ఉన్న రాహుల్ తేజ్ తండ్రి వేణుగోపాల్ ఇంటలిజెన్స్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్నారు.

**7 పబ్ లకు నోటీసులు**

ఖాజాగూడలో నివాసం ఉంటున్న పల్లెపాక మోహన్ తరచూ బెంగళూరులో ఉండే నైజీరియన్ జెర్రీ నుంచి మాదకద్రవ్యాలను కొనుగోలు చేసి సూర్యకు సరఫరా చేస్తున్నట్లు ఈగల్ టీమ్ పోలీసులు గుర్తించారు. నైజీరియన్ల నుంచి మాదకద్రవ్యాలను కొనుగోలు చేసి, వాటిని పబ్స్, రెస్టారెంట్ల ద్వారా విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కేసులో మొత్తం 25 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసులో ఇప్పటికే 7 పబ్ లకు నోటీసులు జారీ చేశారు. ఆరుగురు నిందితులను కస్టడీకి కోరారు.

## రేవంత్ రెడ్డి.. ఇదే నా ఛాలెంజ్

### కాంగ్రెస్ నుండి ఒక్కరిని కూడా అసెంబ్లీకి రానివ్వా

- నల్గొండ నుండి ఒక్కడినే ఉన్నా.. ఒక్కటి కూడా లేకుండా చేస్తా
- మా ప్రభుత్వం హయాంలో పంచిన రేషన్ కార్డుల సంఖ్య 6,47,479
- నిజమైతే వచ్చినోళ్ల చెంప నేను పగలకొడతా.. తప్పు అయితే నన్ను కొట్టండి
- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** తుంగతుర్తి సభపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుల పంపిణీ పేరు మీద తుంగతుర్తిలో ప్రభుత్వ ఖర్చుతో సభకు జనాలను తీసుకొచ్చారు.. అది పూర్తిగా అధికారిక కార్యక్రమని వ్యాఖ్యానించారు. నేను రేవంత్ రెడ్డి స్థాయికి దిగజారను.. సీఎం ఎంత మొత్తుకున్నా సభలో జనం నుంచి స్పందన లేదని విమర్శించారు. సీఎం అబద్ధాలు మాట్లాడుతుంటే ప్రజలు ఎందుకు స్పందిస్తారు? అని ప్రశ్నించారు. బూతులు తిడితేనైనా స్పందిస్తారని సీఎం బూతులకు తెగబడ్డారని దుయ్యబట్టారు. సీఎంకు సంస్కారం, బుద్ధి పెరగలేదని మండిపడ్డారు. సీఎం మాట్లాడిన మాటలు చూసి జనం నవ్వుకుంటున్నారని, కేసీఆర్ హయంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని సీఎం అబద్ధాలు మాట్లాడారని అన్నారు. జూలై 2021లో ప్రతిపక్ష నేతగా భట్టి విక్రమార్క తన నియోజకవర్గంలో రేషన్ కార్డులు పంచినట్లు అప్పట్లో ట్వీట్ చేశారని, ఇప్పటి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎంపీగా బీఆర్ఎస్‌లో ఉన్నపుడు రేషన్ కార్డుల పంపిణీ గురించి ప్రత్రికల్లో ప్రకటనలు ఇచ్చారని చెప్పారు.

**6.47 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం..**

'చౌటుప్పల్‌లో అప్పటి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సమక్షంలో నేను రేషన్ కార్డులు పంచాను. 6.47 లక్షల రేషన్ కార్డులను కేసీఆర్ హయాంలో పంచాం. నా వాదనను తప్పని నిరూపిస్తే చెంప దెబ్బ కొట్టించుకోవడానికి సిద్ధం. కాంగ్రెస్ నేతలు చెంప దెబ్బలు తినడానికి సిద్ధం కావాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని ఏళ్ళు అవుతున్నా రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురుచూడటం ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ వైఫల్యం వల్ల కాదా?. గతంలో కేసీఆర్ జిల్లా పర్యటనలకు వచ్చినపుడు కొత్త కార్యక్రమాలు ప్రకటించేవారు. సీఎం తుంగతుర్తిలో తిట్లు తప్ప ఏమీ ఇవ్వలేదు. కాంగ్రెస్, టీడీపీ పాలన వల్లే నల్లగొండలో ఫ్లోరోసిస్ మహమ్మారి 2 లక్షల మందిని కబళించింది. నీళ్ల



విషయంలో అన్యాయం చేసి మళ్ళీ ఏవో చెబుతున్నారు. మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించే నల్లగొండను 40 లక్షల మెట్రిక్ టన్నుల స్థాయికి తీసుకెళ్లింది కేసీఆర్ కాదా?. వ్యవసాయాన్ని నల్లగొండ జిల్లాలో కేసీఆర్ పండగలా మార్చారు. కాంగ్రెస్ పాలన వచ్చాక ఒక్క ఎకరాకు అయినా అదనంగా నీరొచ్చిందా?. నల్లగొండ జిల్లాకు వచ్చిన కాళేశ్వరం జలాలకు కేసీఆర్ హారతి ఇచ్చిన దృశ్యాలు చూడలేదా?' అంటూ కామెంట్స్ చేశారు.

**మళ్ళీ ఫ్యాక్షన్ రోజులు తెస్తున్నారు..**

'మూడు మెడికల్ కళాశాలలు జిల్లాకు తెచ్చింది కేసీఆర్ కాదా?. యాదాద్రిని అద్భుత దైవక్షేత్రంగా తీర్చిదిద్దింది కేసీఆర్ కాదా?. ఎన్నికల కోసం వేసిన రైతు భరోసా పాతది.. యాసంగిది, వానాకాలంది వేయాలి. రైతాంగానికి ఇంకా 27 వేల కోట్ల రూపాయలు రేవంత్ ప్రభుత్వం బాకీ ఉంది. కాంగ్రెస్, టీడీపీ పాలనలో నల్గొండ పల్లెల పరిస్థితి ఎలా ఉండేది.. కేసీఆర్ వచ్చాక ఎలా అయిందో ప్రజలకు తెలియదా?. తుంగతుర్తిలో సీఎం వచ్చే కన్నా ముందు కూడా కాంగ్రెస్ నేతలు తన్నుకున్నారు.. మళ్ళీ ఫ్యాక్షన్ రోజులు తెస్తున్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉద్యోగాల భర్తీ విషయంలో రేవంత్ రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే' అని అన్నారు.

## తీన్మార్ మల్లన్నకు సిట్ పిలుపు

### ఫోన్ ట్యాప్ కేసులో వాంగ్మూలం ఇవ్వాలని సూచన

**హైదరాబాద్, మహా:** పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సిట్ నుంచి పిలుపు వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇవ్వాలని ఆయనను కోరింది. గురువారం లోపు జూబ్లీహిల్స్ పీఎస్‌లో స్టేట్‌మెంట్ ఇవ్వాలని తీన్మార్ మల్లన్నకు సిట్ సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసిన సిట్... వారి నుంచి కీలక సమాచారాన్ని రాబట్టింది. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావించిన మాజీ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ టి. ప్రభాకర్ రావుని కూడా ఇటీవలే అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ కేసులోని మూలాలను వెలికి తీసే పనిలో అధికారులు ఉన్నారు.

## కాంగ్రెస్ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు

### ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

**మిర్యాలగూడ, మహా:** తుంగతుర్తి సభలో సీఎం రేవంత్ రెడ్డి తన స్థాయిని మరిచి మాట్లాడి ప్రజల్లో అభాస పాలయ్యారని ఎమ్మెల్సీ కోటిరెడ్డి అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసి కాంగ్రెస్ కూడా తన స్థాయిని తగ్గించుకుందని వ్యాఖ్యానించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చేసిన అభివృద్ధి చెప్పుకోవడానికి ఏమీ లేక మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకొని మాట్లాడటం సరైన పద్ధతి కాదని సూచించారు. 20 నెలల్లో రాష్ట్ర



అభివృద్ధికి కొత్తగా కాంగ్రెస్ చేసింది లేదని విమర్శించారు. రెండు సార్లు రైతుబంధు ఎగగొట్టి రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. వస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆరోపించారు.



## అక్రమార్కుల నుంచి భూమిని కాపాడండి

**మిర్యాలగూడ, మహా:** మండలంలోని యాద్గార్ పల్లి గ్రామ శివారులోని గంగమ్మ తల్లి గుట్టకు చెందిన భూమి సర్వే చేసి ఆక్రమించేందుకు కొంత మంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, దానిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి రాములు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్ లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో కొందరు వ్యక్తులు గుట్ట భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, విచారణ జరిపి చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.రామకృష్ణ, బడుగుల లింగయ్య, ఎం.సైదులు, పీ.మల్లయ్య, సీహెచ్ శేఖర్, రవికాంత్, కేశయ్య, వెంకటయ్య ఉన్నారు.

## జర్నలిస్టులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

### వర్కింగ్ జర్నలిస్టులకు కల్పిస్తున్న ఉచిత హెల్త్ స్కీమ్ పొడిగింపు
### 2025 -26 ఏడాదికి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ

**అమరావతి, మహా:** జర్నలిస్టులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వర్కింగ్ జర్నలిస్టులకు కల్పిస్తున్న ఉచిత హెల్త్ స్కీమ్ పథకం 2025 26 ఏడాదికి పొడిగించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జర్నలిస్ట్ సోదరులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో గుర్తింపు పొందిన వర్కింగ్ జర్నలిస్టులకు నగదు రహిత చికిత్స అందించే లక్ష్యంతో ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వం జీవోలో తెలిపింది. ఈ పథకం జర్నలిస్ట్, జీవిత భాగస్వామి, పిల్లలకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) తరహాలో వర్తిస్తుందని వివరించింది.

## సామాన్యుడిలా సీఎం రేవంత్!

- ఎకానమీ క్లాస్‌లో ప్రయాణం చేస్తూ ఢిల్లీకి
- సోషల్ మీడియాలో ఫోటోలు వైరల్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఢిల్లీ వెళ్తున్న సందర్భంగా సీఎం మరోసారి సామాన్యుడిలా ఎకానమీ క్లాస్‌లో ప్రయాణం సాగించారు. దీంతో ఆ ఫొటోలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రజల సీఎం అంటే ఇలా ఉంటారని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఏపీ నిర్మించ తలపెట్టిన బనకచర్ల వివాదంపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులతో భేటీ నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సమావేశానికి హాజరయ్యేందుకు ఏపీ సీఎం చంద్రబాబు సుముఖంగా ఉండగా తెలంగాణ ప్రభుత్వం మాత్రం తాము వచ్చేది లేదని తేల్చిచెప్పింది. అయితే ఈ సమావేశం ఎజెండా మారిస్తే తాము కూడా హాజరవుతామని కేంద్ర మంత్రికి సిఎం రేవంత్ రెడ్డి తెలపగా.. ఈ హుటాహుటి ప్రయాణానికి కారణం మాత్రం ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశమేనని రాజకీయాల్లో చర్చ నడుస్తోంది.

## బీసీలను విడదీసే కుట్ర జరుగుతుంది

### కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేసింది
### బీసీలు ఏకతాటి పైకి రావాలి.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్, మహా :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బీసీ రిజర్వేషన్ అంశంపై తీవ్రంగా స్పందించారు. ఇందిరా పార్కు వద్ద బీఆర్ఎస్ చేపట్టిన బీసీ ధర్నాకు హాజరైన తలసాని మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీలను విడదీసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. సాధ్యం కాని విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పడం విడ్డూరమన్నారు. బీసీలు తలుచుకుంటే రాజకీయ భూకంపం వస్తుందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో బీసీలంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళతామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పై గతంలో పలువురు ముఖ్యమంత్రులు తీర్మానాలు చేశారని గుర్తు చేశారు. కానీ రిజర్వేషన్ల అంశం రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో పెడితే తప్ప అది సాధ్యం కాదని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై అప్పుడే అంతా అయిపోయినట్లుగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి సన్మానం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.



## నిరుపయోగంగా స్లీపింగ్ మిషన్!

**మిర్యాలగూడ, మహా:** మున్సిపాలిటీ ఆవరణలో స్లీపింగ్ మిషన్ మ్యూజియంలో బొమ్మలా నిరుపయోగంగా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ పాలకవర్గం సుమారు రూ. 60 లక్షల వ్యయంతో కొనుగోలు చేసింది. మున్సిపాలిటీలో శాశ్వత, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు ఉన్న కూడా స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేశారు. మిషన్‌తో ఒక రోజూ ఊడ్చిన దాఖలాలు లేవు. ఊడిస్తే ప్రధాన తారు రోడ్డు మాత్రమే.. ఊడ్చేటప్పుడు దాని ద్వారా లేచే దుమ్ముతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు.

## ఓబీసీ సలహా.. మండలి సమావేశాలకు రాష్ట్ర నేతలు

### హాజరైన పీసీసీ చీఫ్, పొన్నం, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి తదితరులు

**బెంగుళూరు, మహా:** బెంగుళూరులో ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బెంగుళూరుకు చేరుకున్న రాష్ట్ర నేతలకు కర్ణాటక లీడర్లు స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు తెలంగాణ నుంచి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ మధు యాష్కీ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విజయంతంగా పూర్తి చేసిన కులగణన, 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుపై ఇందులో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ప్రసంగించనున్నారు. అలాగే దేశ



వ్యాప్తంగా ఓబీసీల సమస్యలు, వాటి పరిష్కారం, ఈ వర్గాల విషయంలో మోదీ సర్కార్ అవలంభిస్తున్న విధానాలపై ఇందులో ప్రధానంగా చర్చించనున్నారు.

## సమరానికి సై

### మరోసారి రాజాసింగ్ పై మాధవీలత ఫైర్.. తనను కించపరిచేలా మాట్లాడారని వ్యాఖ్య
### ఎన్నికల్లో రాజాసింగ్ తనకు సహకరించకున్నా ఎక్కువ ఓట్లు వచ్చాయన్న నేత

**హైదరాబాద్, మహా :** ఇటీవల బీజేపీకి గుడ్ బై చెప్పిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పై ఆ పార్టీ నాయకురాలు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాధవీలత విమర్శలు గుప్పించారు. బీజేపీ మద్దతు లేకుండానే రాజాసింగ్ ఎమ్మెల్యేగా గొలుపొందారా? అని ప్రశ్నించారు. కార్పొరేటర్ గా ఉన్న రాజాసింగ్ ను ఎమ్మెల్యే చేసింది బీజేపీనే అని చెప్పారు. బీజేపీ గురించి ఏది పడితే అది మాట్లాడటం సరికాదన్నారు. ఇతర మతాల వారిని, మహిళలను దూషించడమే హిందుత్వమా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన తనకు రాజాసింగ్ సహకరించలేదని మాధవీలత విమర్శించారు. ఎంపీ అభ్యర్థిగా మగాళ్లే దొరకలేదా? అంటూ తన గురించి హేళనగా మాట్లాడారని మండిపడ్డారు. గోషామహల్ లో రాజాసింగ్ కంటే తనకే ఎక్కువ ఓట్లు వచ్చాయని అన్నారు. మాధవీలత బలహీనురాలు కాదని చెప్పారు. గోషామహల్ స్థానాన్ని తనతో భర్తీ చేయాలని హైకమాండ్ భావిస్తుండటం తన అదృష్టమని అన్నారు. గోషామహల్, జూబ్లీహిల్స్ ఎక్కడ పోటీ చేయమన్నా బరిలోకి దిగేందుకు తాను సిద్ధమని చెప్పారు.

## 26 నుంచి 30 వరకు సింగపూర్ పర్యటనకు ఏపీ సీఎం చంద్రబాబు

### తోడుగా మంత్రిలు లోకేష్, నారాయణ, ఎంపీ భరత్.. ఇన్‌ఛార్జ్ సీఎంగా పవన్ కళ్యాణ్ ?

**అమరావతి, మహా :** ఈ నెల 2630 వరకు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నాలుగు రోజుల పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇన్‌ఛార్జ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. ఆయనతోపాటు మంత్రులు నారా లోకేశ్, నారాయణ, టీజీ భరత్ కూడా సింగపూర్‌కు వెళ్లే అవకాశం ఉంది. చంద్రబాబు పర్యటనలో ప్రధానంగా ఏపీలో నిర్మితమవుతున్న రాజధాని అమరావతి, పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు తదితరాలపై అక్కడి వ్యాపార దిగ్గజాలతో వరుస భేటీలు జరుగనున్నాయి.

## మెదక్ కాంగ్రెస్ యువనేత హత్యలో ట్విస్టులు

### యాక్సిడెంట్ అని హాస్పిటల్ తీసుకెళ్తే బుల్లెట్ గాయాలు ..
### రియల్ ఎస్టేట్ వ్యాపారులతో వివాదమే కారణమా?

**సంగారెడ్డి, మహా :** మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతరకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు మరెల్లి అనిల్ (28) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్ నుంచి సొంతూరికి తన కారులో వస్తుండగా వరిగుంతం సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిల్ ప్రాణాలు విడిచాడు. ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కుల్చారం ఎస్సై గౌస్ మంగళవారం ఉదయం ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లి చూడగా, ఘటనా స్థలంలో నాలుగు బుల్లెట్లు లభ్యమయ్యాయి. దీంతో అనిల్ రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని ముందు భావించినా, బుల్లెట్లు లభించడంతో ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. అనిల్ కుడి భుజం నుంచి 2 బుల్లెట్లు దూసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. చనిపోయే ముందు అనిల్ తన చేతిపై ఓ ఫోన్ నంబర్ రాసినట్లు తెలిపారు. అయితే అనిల్‌పై ఎవరు



కాల్పులు జరిపారు? ఎందుకు జరిపారు? హత్యనా? లేక ఆత్మహత్యనా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో ఉన్నట్లు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అనిల్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో విభేదాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని ఓ 6 గుంటల భూమి విషయంలో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థతో వివాదం ఉందని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ మేరకు అనిల్ హత్యకు ఈ భూ వివాదమే కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## భట్టికి లీగల్ నోటీసులు

### నోటీస్ పంపిన బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్‌రావు
### రోహిత్ వేముల ఆత్మహత్య ఇష్యూపై కామెంట్స్ చేసిన డిప్యూటీ సీఎం
### బేషరతుగా మూడు రోజుల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు లీగల్ నోటీసులు పంపారు. హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు రామ్‌చందర్ రావే కారణమంటూ భట్టి విక్రమార్క ఆరోపణలు చేశారని, బేషరతుగా మూడు రోజుల్లో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భట్టి విక్రమార్క క్షమాపణలు చెప్పకపోతే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని, రూ.25 లక్షలకు పరువు నష్ట దావా వేస్తామని హెచ్చరించారు. తన అడ్వకేట్ విజయ కాంత్‌తో రామచందర్‌రావు నోటీసులు పంపారు. గతంలో కోర్టు ఇచ్చిన తీర్పు కాపీని రామచందర్‌రావు తరుపు అడ్వకేట్ అటాచ్ చేశారు.

**భట్టి చేసిన వ్యాఖ్యలు..**

కాగా, ఇటీవల ఢిల్లీలో భట్టి విక్రమార్క మీడియాతో



మాట్లాడుతూ.. రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారంటూ కామెంట్లు చేశారు. రామచందర్‌రావుకు ఆ పదవి ఇవ్వడంపై బీజేపీ పెద్దలు పునరాలోచన చేయాలని చెప్పారు. రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై తమ సర్కారు విచారణ జరుపుతోందన్నారు. అంతేగాక, రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని చెప్పారు. 2016లో వర్సిటీ యాజమాన్యం రోహిత్ వేములపై చర్యలు తీసుకునేలా రామచందర్‌రావు ఆందోళన చేశారన్నారు.

## భార్య చికెన్ తినలేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్య

**మహా:** తమిళనాడులో దారుణం జరిగింది. భార్య చికెన్ తినేందుకు నిరాకరించిందని నవ వరుడు మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. ఇక వివరాల్లోకి వెళ్తే.. తంజావూరు జిల్లాలోని కుంభకోణం తాలుకాలో సక్కోట్టై ప్రాంతంలో మణికంఠన్ (29) ఉంటున్నాడు. ఇతను ఫర్నిచర్ దుకాణంలో పనిచేసేవాడు. అయితే తనతో కలిసి పనిచేసే సుబలక్ష్మి(25) అనే అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. నెల రోజుల క్రితం తల్లిదండ్రులను ఎదురించి చెన్నైలోని ఓ ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత ఈ నవదంపతులు తిరప్పూర్ జిల్లా వెల్ల కోవిల్ పుత్తూరులోని సుబలక్ష్మి సోదరి మేనక ఇంటికి వెళ్లారు. అప్పటినుంచి అక్కడే ఉంటున్నారు. అయితే మేనక, తన భర్త ఆదివారం ఓ ఆలయ ప్రత్యేక కార్యక్రమం కోసం తిరచ్చికి వెళ్లారు. దీంతో మణికంఠన్ దుకాణం నుంచి చికెన్ తీసుకొచ్చాడు. భార్యను తినమని అడిగాడు. కానీ సుబ్బలక్ష్మి ఇందుకు ఒప్పుకోలేదు. తన సోదరి గుడికి వెళ్లినందువల్ల ఇంట్లో చికెన్ తినేందుకు ఆమె నిరాకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేసిన మణికంఠన్ ఇంటి బయట ఇనుప కడ్డీకి చీరతో ఉరేసుకొని సూసైడ్ చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న స్థానికులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే మణికంఠన్ మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు.

